

శంకర్

# నిదురలో నిజం

## ఈటూరు రాధాకృష్ణారావు

*ఎవరి అనుభూతులు వారికి నిజం. అందరికీ కాదు. స్నేహమూ అలాంటిదే. ఒక వయసులో నిజమై నిలిచినా పరిణత మనస్కుడు యధార్థాన్ని గుర్తించక పోవడం చేటు. అవకాశం లభించాలి, మరి.*

**కమ్మరి** కొలిమిలో కణకణలాడే లోహ శకలంలా మండుతున్న సూర్యుడు జగత్తుకంతకూ సెగలను వ్యాపింపజేసి మాడుస్తున్నాడు. మిట్ట మధ్యాహ్నం. కండ్లు మిరుమిట్లు గొల్పేలా ఎండ కాస్తున్నది. మిల మిలా మెరుస్తూ సర్రున దూసుకుపోతున్న తెల్ల త్రాచులా తారురోడ్డు ఎన్నెన్నో మెలికలు తిరిగి ఎక్కడెక్కడో కొంత కొంతగా కనిపిస్తూ దిగంతాలదాకా పయనిస్తున్నట్లు కనిపించనిచోట మాయమవుతున్నది. లారీ ముందరి సీట్లో డ్రైవరు ప్రక్కనకూర్చున్న నాకు మధ్య మధ్య వడగాడ్పు వడివడిగా వీచి రెండు చెంపలు ఛడేల్‌మనిపించి కళ్లకు నీళ్లు తెప్పిస్తున్నది. మనస్సు ఆ వేడికి ముడుచుకు పోయిందేమో, కునుకులాంటి మైకం కమ్మింది. చేయుడానికి మరేమీ లేనప్పుడు మనస్సెన్నైనా ఆలోచిస్తుంది. కన్నెపిల్లలా ఆశలను కూర్చుకుంటుంది. వండుమునలిలా విస్పృహ జెందుతుంది. వేదాంతిలా నిర్లిప్తత వహిస్తుంది. ఎటూ తిరిగి చివరకు గెలిచిన రాజకీయ నాయకుడులా తనకు లేని గొప్పతనపు తృప్తి నిలపాదించుకొని నిమ్మళంగా దిగమింగుతుంది.

వెంకట్రావు రమ్మని చెబుతూ ఉత్తరాలు వ్రాస్తూ, బహుశా వాడికి విసుగు వచ్చిందేమో ఈమధ్యన మానుకున్నాడు. పది రోజుల క్రితం నేను వ్రాసిన ఉత్తరానికి జవాబు బహుశా అందుకే వ్రాయకపోవచ్చు. మా ఆత్మీయత ఎంత గాఢమైనదంటే ఒక్క కంచంలో తిని ఒక్క మంచంలో పన్నాం. ఈ మాట నందరూ అత్యుక్తికై ఉపయోగిస్తారేమోగాని మా విషయంలో మాత్రం అది స్వభావోక్తి. ఒకడి కష్టానికి మరొకళ్లం పస్తులు పన్నాం. ఒకడి అవమానాన్ని మరొకళ్లం సమభాగంగా భాగించుకొని బంధువర్గంలో "ఇద్దరూ చెడ్డవాళ్లగా"

పేరు తెచ్చుకున్నాం. ఇది ఆరేండ్ల క్రింది విషయం. మధ్య మధ్య వరంగల్లులోనో, హన్మకొండలోనో ప్రేయసీ ప్రియుల్లా ఉత్తరాల ద్వారా పిలిపించుకొని సినిమాలు చూస్తూ కాలం గడిపాం. వాడి ఊరికి వాడి పెళ్లిలోమాత్రం వెళ్లాను. ఇప్పు డెలా ఉన్నాడో? ఆ రోజుల్లో మేం మాట్లాడుకోని విషయంలేదు. నిర్మించుకోని ఆకాశహర్మ్యం లేదు. అంతేకాక భవిష్యత్తులో మేము పరస్పరంగా జీవించే విధానం మీద నిర్మించుకున్న ఊహాజగత్తు ముద్ర ఇప్పటికీ మధురంగా, మధురతరంగా, మల్లెపూల సౌరభంలా పరవశం కలిగిస్తున్నది. హఠాత్తుగా ఎవరో మనిషి లారీకి అడ్డంగా రావడంవల్ల ఒక్కసారిగా ఆగిన లారీ కుదుపు మళ్లీ స్పృహ కలిగించింది. ఏదో పగిలిపోయి నట్లయింది. ఇంతవరకు ఓపిగ్గా పేర్చుకుంటూ వస్తున్న గాజు వస్తువులు క్రిందబడి పగిలి చిన్నాభిన్నమైపోయినట్లుగా, తిరిగి కూర్చడానికి వీల్లేనట్లు ఆలోచనలు చెదరిపోయాయి. ఓపిగ్గా పేర్చుకున్న ముత్యాలు పది దిక్కులా పారబోసినట్లు నా ఊహాజగత్తు విసిరి వేయబడ్డది. తిరిగి కూర్చుకోవడం ఎంత కష్టం!

"మాచీస్ దీజియే" అని డ్రైవరు చాలా గౌరవంగా అడిగాడు.

ఇది నేను ఊహించని విషయం. ఇంతకు క్రితమే రోడ్డుమీద, ఎక్కుతున్న ప్రయాణికులతో బహు మొరటుగా "రారా! పోరా!" లు మాట్లాడిన డ్రైవరు ఈవిధంగా నన్నడగడం అంటే వారందరిలో లేని ఏదో విశిష్టత నాలో ఉందని అనుకున్న ట్టేనా? అబ్బే, మనస్సొప్పుకోలేదు. అయినా సంతోషించింది. ఆ సంతోషంలో ఏదో హుందాతనం, గొప్పతనం, పెద్దమనిషితనం వచ్చి, ఠీవిగా పంట్లాం జేబులోంచి సిగరెట్ తీసి నేను ముట్టించి అతనికీ ఒకటి ఇచ్చాను.

కాల్చి "ఇక్కడ లారీకై ఇంతమంది ఎగబడుతున్నారే, సర్కారీ బస్సులు సరిపోవా?" అన్నాడు.

సంభాషణ పొడిగించడం నా కిష్టంలేదు. కాని పెద్దమనిషిలా అడుగుతున్నప్పుడు గర్వం, గీర్వాణం ప్రదర్శిస్తే ఉన్న పరువు కాస్తా పోతుంది. పైగా దీనికి జవాబు చెప్పడం నాకేమంత కష్టమూకాదు. "ఎండాకాలం గదూ! అందుచేత సర్కారీ బస్సుల్లో నిలబడ్డ ప్రయాణికులు వాళ్ల కక్కర్లేదు. ఎన్ని సీట్లో అంత మంది మాత్రమే తీసికోబడతారు. అదీగాక ఇది పెళ్లిళ్లకాలం. అందులోనూ, ఈ దారిలో కాస్త రద్దీ ఎక్కువ" అన్నాను.

"ఎంతైనా ఇదే మన్యాయం? మరి రెండు బస్సులు ఎక్కువ వేస్తే సరి."

చాలా సులువుగా పరిష్కారం చూపించాడు ప్రభుత్వానికి. కాని పరిష్కారంగాదు ప్రభుత్వానికి కావలసింది; సమస్యలు. ఎన్ని సమస్య లెక్కువైతే ప్రజ లెంత ఇబ్బందుల పాలవుతే ప్రభుత్వంవారికి అంత ఎక్కువ జ్ఞాపకం వస్తుంది. తద్వారా రాజకీయ నాయకులకు ఎన్నికల రోజుల్లో ఉపన్యాసా లివ్వడానికీ, వాగ్దానాలు చేయడానికీ అంత ముడిసరుకు లభ్యమవుతుందన్నమాట!

నా యీ ఆలోచన అతనికి చెప్పలేకపోయాను. కారణ మేమిటంటే నే నాలోచించే విధానం అతనికి నచ్చకపోవచ్చు. రెండవది: నాకు సంభాషణ త్రుంచివేయాలనిపించడం. మూడవది: లారీ రొదలో నే చెప్పేదంతా అతనికి వినిపించదేమోనని అనుమానం. కాబట్టి "అబ్బే! చాలా బస్సులే నడుస్తాయి. కాని ఈరోజేదో విశేషం ఉండి ఉండాలి" అన్నాను.

"కాదండీ.నేనుచాలాదూరంనుంచిచూస్తున్నా. చాలామందిని ఎక్కించుకోలేదు గూడా, ఏదో ఇక్కడ కొందరిని తప్ప. పాపం ఎండలో రోడ్డు మీద ఎంత కష్టం!" అన్నాడు.

ఈ చివరిమాట దాదాపు స్వగతం. కాని మంచిగా ఉంది. నేను ఊహించుకునే లారీ డ్రైవర్లు, కారు డ్రైవర్లు ఇంత సంస్కారులూ, ఆర్ద్రహృదయులూ కారు. కారణ మేమిటంటే విరుద్ధ తత్వాలవాళ్లే ఇంతవరకు తటస్థపడ్డారు నాకు.

"ఔను నిజమే! పాపం ఎండలో చాలా కష్టం" అన్నాను.

ఎండ అంటే జ్ఞాపకం వచ్చింది. దుర్భరంగా ఉంది; దుస్సహంగానూ ఉంది బాధలా. కాని తప్పడంలేదు. ఔనౌను. బాధలూ అంతే. వద్దన్నా ఊరుకోవు. దుస్సహంగానూ, దుర్భరంగానూ ఉంటాయి. ఈ రెంటిలో బాధలా ఎండ ఉందా? ఎండలా బాధ ఉందా? ఏది ఉపమానం? ఏది ఉపమేయం?

వెంకట్రావు మళ్లా జ్ఞాపకం వచ్చాడు. అబ్బ కరిగిన కల, చెదరిన కల తిరిగి రావడం అంటే గతించిన బాల్యం తిరిగి లభ్యం అయినట్టే! చివరిసారిగా పెండ్లిలో చూశాను. భార్య చాలా అందంగా ఉంటుంది. చదువుకున్నది కూడాను. పైగా మేనమరదలు. వాడికేం,వాడూ అందంగానే ఉంటాడు. ఆస్తి చాలా ఉంది. ఓ మేడ, ఓ రేడియో, ఇత్యాది ఆధునాతన సౌఖ్యాస్పద వస్తుసంచయం. అతనొక్కడే సంతానం తలి దండ్రులకు. ఇది మరీ అనుకూలం సౌఖ్యపడడానికి. వాడి జీవితమంతా "వడ్డించిన విస్తరి." హాయిగా కూర్చుని పుస్తకాలు చదువుతూ, రేడియో వింటూ, పాలేళ్లకు పనులు పురమాయిస్తూ, జీవితంలోని ఈ మొదటిదశలో "సౌఖ్యం" రుచిచూస్తూ ఉండవచ్చు. మరి ఆ రోజుల్లో బాధపడ్డం ఎందుకో!

దానికి సమాధానం చిక్కలేదు. కొంతసేపటికి మనస్సు సమాధానాన్ని ఏరుకుంది. అంతా 'స్వయంకృతం' అని! ఎలా? సరిగా తనకు తాను సరిపుచ్చుకోలేక. అంతే! ప్రతివాడూ తనకున్న వాటినీ, కావలసినవాటినీ ఏదో దారంతో బంధించి సమన్వయపరచుకోవాలి. లేకుంటే కోరుకుంటున్న కోరికలు ఒకవేపు ఎటో పరుగెత్తిపోతాయి. ఈలోపల వచ్చిన అవకాశాలతో వాటికి లంగరు కుదరదు. తిరిగి ఇవీ ఎటో వెళ్లిపోతాయి. తిరిగి కోరికలు. ఛన్! ఇదేదో విడివడని సమస్య. శాంతి పరిరక్షణార్థం ఆయుధధారణలాంటి అంతర్జాతీయ అపరిష్కృత అర్థాన్న సమస్య.

ఇలాగే జరిగి ఉండాలి. మాబోంట్లతో అంటే స్నేహితులతో డబ్బు తగలేస్తూ, బాంధవ్యం మరిచిపోయి స్నేహమే అన్నీ అని విశ్వసించి, అవకాశాలను చిందర వందర చేసుకొని ఉండవచ్చు... కాదు, కాదు. చేసుకొన్నాడు. ఔను! ఇప్పుడిప్పుడే స్పష్టం చేశాడు. బాధపడ్డాడు.

* * * *

కాని ఇప్పుడు? చాలా సుఖపడుతున్నాడు. ఒక్కసారే వాడి ఇల్లూ, తల్లీ, తండ్రీ అంతా కనిపించి కడుపు నిండినంత సంతోషం కలిగింది.

"హల్లో, వచ్చావా? ఎన్నాళ్ల కెన్నాళ్లకు! ఇన్నాళ్లకా నామీద దయ?" హృదయపూర్వకంగా ఆహ్వానించి సంతోషం పట్ట లేక బిగ్గరగా కావిలించుకుని అంతటితో తృప్తి జెందక నాలుగు సార్లు శరీరం బొప్పికట్టేలా వాయించి కేక వేశాడు వెంకట్రావు. "అమ్మా! ఎవరొచ్చారో చూశావా?" అని బలవంతంగా వంట ఇంట్లో ఉన్న తల్లిదగ్గ రికి లాక్కెళ్లి "కాఫీ! కాఫీ!" అని పదిసార్లు కేకలు వేశాడు.



మాలికా రచన

చిత్రం—బి. అప్పిరెడ్డి (పెనుమాక)

వెంకట్రావుకూ,నాకూ స్నేహమేకాదు,బంధుత్వమూ ఉంది. "బాగున్నావా, నాయనా?" పలకరించింది వాడి తల్లి. హాయిగా, ఎండిన గుండెలకు చల్లని పానకంలా మధురంగా, ఆప్యాయంగా పలకరించింది. ఆ మంచితనం మంత్ర ముగ్ధుడులా చేసి క్షణంలో అన్నీ మరిపించింది. అకస్మాత్తుగా మరోవైపు తిరిగి "మీ అన్నయ్యొచ్చాడు. బడ్డు వెధవ!" అంటూనే భార్యకు పరిచయం చేశాడు. వాడి సంతోషానికీ, పసి పిల్లవాడిలా ఆనందిస్తున్న నిర్మలమైన స్నేహపూర్వకమైన మనస్సుకూ హృదయం వికసించి

మనస్సు ఆనందంతో నిశ్చేష్టితయింది. నాకుకావలసిన స్నేహం, నేను కోరుకున్న నిజమైన నిర్మలమైన స్నేహంలభ్యమైందనే తృప్తి కలిగింది. చాలా హంగామా చేశాడు వెంకట్రావు నా రాకతో. మధ్యాహ్నంపూట, భోజనాల తర్వాత హాయిగా ఛలోక్తులు విసురుకున్నాం. మా స్నేహాలూ, బంధుత్వాలూ అన్నీ ఆ సంభాషణలో కలగా పులగమై మేము మేమేనా అనే విషయమే మరిచాం. సాయంకాలం వాడి పొలాలూ, చేలూ, బావులూ అన్నీ తిరిగాం. ఒకచోట ఓ దృశ్యం కనిపించింది. ఏరు. దాని ప్రక్కనే అసంఖ్యాకంగా గుండెలు తీసిన బంటుల్లా నిలుచున్న తాటిచెట్లు. వానికావల అక్కడెక్కడో భూమినీ, ఆకాశాన్నీ సంధించి వేసిన ముడిలా ఓ పర్వతం. చల్లని నీడ. ఇదే 'భూమికి ఆవలితీరం' అనిపించేంత గొప్ప దృశ్యం. గట్టునే ఏటిమీద నిర్మించుకున్న ఏతాం. 'కిరకిర' నాదంతో నీటిని తోడుతూ హాయిగా పాడుకొంటున్న రైతు. ఇదంతా మరేదో లోకంలా తోచింది. హృదయంలో కవిత్వం చిందులు త్రొక్కింది. మూగ వీణపై మధురగానం అంటే ఏమిటో మనస్సు తెలుసుకొంది.

సాయంకాలంపూట ఇంటికి వస్తూ అనంతంగా కబుర్లు చెప్పుకున్నాం. ఎంతకూ అంతంగాని మానవుని స్నేహ పిపాసలా ఉంది సంభాషణ. భోజనాలు చేసి మేడపై పడుకొన్నాం. అంతా సంతోషమే. మళ్లా ఏదో సంభాషణ ఉత్పన్నమైంది. మాకు ఎరిగి ఉన్న ప్రతివాడు గురించీ నడుస్తున్నది.

నాకు మనస్సులో దడ అరంభమైంది. నేను వచ్చిన విషయం మాట్లాడం వెలితికి చిహ్నమేమోననిపించింది. 'అర్థసహాయం' అనేది ఎటువంటివారిలోనైనాసరే చీలికలు తెస్తుంది. ఇంత మంచివాడితో నేను డబ్బుకై వచ్చానని, తిరిగి ఎన్నడో ఉద్యోగం దొరికిన తర్వాత తీర్చగలనని ఎలా చెప్పను? పరితాపం కలిగింది. పది రోజుల క్రితం ఇదే విషయమై ఉత్తరం వ్రాయడమే పొరపాటేమో!

సరే! ఉత్తరం ప్రసక్తి వాడైనా తీసుకువస్తాడేమోనని ఎదురు చూచాను. కాని, కనీసం నేను ఒక ఉత్తరం వ్రాశాననే విషయం రానీకనే సంభాషణ నడుస్తున్నది.

రాత్రి పన్నెండయింది. ఇంకా మాకు నిద్ర రావడంలేదు. ప్రక్కవాటాలోనుంచి దగ్గిన ధ్వని వినిపించుతున్నది మధ్య మధ్యన—వాడి భార్యది. కాని మా మాటల్లో దాన్ని లక్ష్యపెట్టడం లేదు మేము. కాని వెంకట్రావులో ఏదో బిడియం కనిపించసాగింది. సాధ్యమైనంత వరకు కల్పించుకొన్న ఓపిక మాత్రమే వాడి ముఖంలో కనిపించసాగింది. వాడేదో చెబుతూనే ఉన్నాడు. 'ఊ' కొడుతూ కన్ను మూతపడుతుంటే అలాగే పడుకున్నాను.

* * * *

'ధబ్'న ఏదో పడ్డ ధ్వనికి మెలకువచ్చింది. చూస్తే ఒంటరిగా ఉన్నాను. కాని గుసగుసగా

# నిదురలో నిజం

సంభాషణ వినిపించుతున్నది. నిశ్శబ్దమైన ఆ చీకట్లో, ప్రతి నిశ్వాసమూ సుస్పష్టంగా వినిపించే ఆ నిశ్శబ్దంలో ఒక్కొక్కమాటే వినిపించసాగింది.

"ఛట్! నోర్ముయ్! పళ్లురాలేను." ఈకంఠం వెంకట్రావుది.

"మూయించండి. అంతకంటే చేసే ప్రయోజకత్వం ఒకటి ఉంటేగా?"

ఈ మాటలు వింటుంటే కొంపదీసి నా గురించిన సంభాషణ కాదుగదా అనిపించసాగింది. హఠాత్తుగా మైకం వదిలి ఊపిరి బిగించి, చెవులు పాముచెవుల్లా ప్రతి శబ్దాన్నీ గ్రహిస్తూ ఉంటే ఆలకించసాగాను.

"ఏయ్! తన్నులు తగులుతాయి, జాగ్రత్త!"

"ఎందుకూ? నిజంమాట్లాడినందుకా? భార్య మీద ఇంత ప్రేమ ఎన్నడైనా ఒలికించారా? అంత గొప్ప స్నేహమైతే అతనితోనే వెళ్లలేకపోయారా? బుద్ధిలేకపోతేసరి! దిక్కులేని వాళ్లందరినీ కొంపలో తెచ్చి కొంప నాశనం జేయండి, ఇలాగే!"

"అబ్బ! వూరుకోవే! వాడికి మెలుకువ వస్తే ప్రమాదం." ఈ కంఠంలో కొంచెం ప్రాధేయత ఉంది.

ఈ సంభాషణ ఎప్పటినుంచి నడుస్తున్నదో కాని మధ్యలోనే వింటున్న నాకు మనస్సు గాయపడ్డది. నా రాకతో వాళ్లమధ్య కలతలు రావడం మిక్కిలి బాధాకరం. కాని చెవులుమాత్రం యథాతథంగా వినడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాయి.

"ఏంటే వినవే! అబద్ధాలాడుతున్నానా? ఇలాంటివాళ్ల స్నేహంతోనేగదూ మీ చదువు నాశనమైంది? పరీక్షలు తప్పిన తర్వాత మూడు నెలలు దేశాలు త్రిప్పింది ఈయనేగదూ మిమ్మల్ని? ఈమధ్యన ఇలాంటి మహానుభావులు రాకపోవడంచేత కొంచెం ఇంటిపట్టున ఉంటున్నారు మీరు. ప్రతి వెధవా మీ స్నేహితుడేనా? ప్రతివాడూ ఇంట్లో రోజుల తరబడి తిని చివరకు 'సహాయం' అడిగేవాడేనా? ఈ మహానుభావుడే పది రోజుల క్రితం ఓ చేట భారతం వ్రాశాడు. ఆయన గారికి 'అర్థసహాయం' కావాలట. పది రోజుల పాటు సుఖించాలని గూడా ఉందట మీతో కలిసి. మీరు సమయానికి ఇంట్లో లేకపోవడంవల్ల నేనే దాచా నా ఉత్తరాన్ని. ఈవిధంగా వచ్చగా ఉన్న మనని ప్రతివాడూ పీక్కుతినడమేనా?"

"ఏమిటే! ఉత్తరంవస్తే దాచావా? రాస్కెల్!"

'ఛట్' మని చెంప ఛెడేల్‌మన్న ధ్వని, దానితో సన్నగా రోదన ధ్వని వినిపించసాగాయి.

"ఇలాంటి పిచ్చివేషాలు వేసి నా స్నేహితులను గురించి మాట్లాడితే జాగ్రత్త."

'ఢాం' అన్ని ఏదో పెద్ద చప్పుడు ఒక్క కుదుపుతో ఈ లోకంలో పడవేసింది. "టైర్ బర్స్ట్!" అని కేకవేస్తున్నాడు క్లీనరు కుర్రాడు. మూడు నిమిషాల్లో లారీ ఆగింది. మనస్సూ ఆగింది. భయంకరమైన స్వప్నంలోంచి బయటపడ్డట్టుగా ఒక్కసారి సర్వాంగాలూ కంపిస్తున్నాయి. అబ్బ! ఇదేమిటి? కరిగిన కలను పేర్చుకుంటే ఇదేమిటీ వికృతరూపం? అర్థంకాలేదు. చక్కని బొమ్మను గీసుకోబోతే, శూర్పణఖ ముఖంలా వచ్చింది, తియ్యని పాట పాడబోతే భయంకర పర్జన్య గర్జారవంలా.


లభించింది సమాధానం. పరీక్షలు తప్పి పిచ్చి పిచ్చిగా రెండు నెలలు తిరిగి వచ్చాం నేనూ, వెంకట్రావూ. ఆమధ్యన మహిళా లోకంలో ఓ ప్రవాదు బయల్దేరింది; వాడిని పూర్తిగా చెడగొట్టి దేశాలు త్రిప్పింది నేనే నని. అందుకే ఓసారి అమ్మ నాతో సున్నితంగా చెప్పినట్టు జ్ఞాపకం. "వెంకట్రావుతో నీకెందుకింతస్నేహం? వాడు చెడిపోయినా. నీవు చెడిపోయినా నీవే బాధ్యుడి వంటుంది లోకం. వాడు కలవాడు. నీవు లేనివాడివి. మీ ఇద్దరి స్నేహం అంత మంచిది కాదేమో!"

ఈమధ్యన వాడి పరిస్థితి గూడా అంత మంచిగా లేదని తెలిసింది. పది రోజుల క్రితం నేను వ్రాసిన ఉత్తరం గూడా సమాధానాన్ని తెచ్చుకోలేకపోవడం దాన్ని ధ్రువపరిచింది.

"మీ స్టేజ్ ఒక్క ఫర్లాంగ్ మాత్రమేసార్. దిగిపోండి. మేము బాగుచేసికొనేవరకు ఓ గంట కనీసం అవుతుంది." డ్రైవరు చెబుతున్నాడు.

"లేదు. వరంగల్‌కే వస్తున్నా నేను."

తెల్లబోయాడు డ్రైవర్. ★



చిత్రం—పి. ఎస్. చంద్రశేఖర్
(సికిందరాబాదు)